ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రీస్తు రాకను స్వాగతిస్తూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. క్రీస్తు రాకను స్వాగతిస్తూ మంగళవారం రాత్రి అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వన్‌టౌన్‌లోని సెయింట్ జాన్స్, సర్క్యూట్ హౌస్ ఎదురుగా ఉన్న సెయింట్ పాల్స్, జిల్లా కోర్టు సమీపంలోని పునీత ఆంథోని వారి దేవాలయం, జగదాంబ జంక్షన్ సమీపంలోని ట్రినిటీ లూథరన్, పోర్టు హాస్పిటల్ సమీపంలోని లూర్దుమాత చర్చిల్లో బుధవారం ఉదయం నుంచి సామూహిక ప్రార్థనలు కొనసాగాయి. క్రీస్తు సందేశాన్ని పాస్టర్లు వినిపించారు.





జిల్లా కోర్టు సమీపంలోని పునీత ఆంథోని చర్చిలో ప్రార్థనలు

వాజపేయికి ఘన నివాళి



మాజీ ప్రధాని వాజపేయి ఆదర్శ నేత అని ఒడిశా గవర్నర్‌గా నియమితులైన కంభంపాటి హరిబాబు అన్నారు. శత జయంతి సందర్భంగా బుధవారం హోటల్ రాక్‌డేల్‌లో జరిగిన కార్యక్రమంలో వాజపేయి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి అంజలి ఘటించారు.

ఐటీ అభివృద్ధికి ఊతం

విశాఖలో ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణానికి శ్రీకారం

- ఏయూలో స్థలం కేటాయింపు
- రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు
- తొక్కిపెట్టిన నాటి వైసీపీ ప్రభుత్వం
- ప్రస్తుత ఐటీ మంత్రి లోకేశ్ చొరవతో ఫైల్‌కు మోక్షం
- ఎగుమతులు పెంపునకు కృషిచేయనున్న సెంటర్
- విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ



ఏయూలో బుధవారం ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్. చిత్రంలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు ఉన్నారు.



గతంలో రూపొందించిన సెంటర్ నమూనా

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నంలో ఐటీ రంగం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖను ఐటీ హబ్‌గా మార్చడానికి కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ చొరవతో ఆరు నెలల వ్యవధిలో రెండు అతి పెద్ద కంపెనీలు విశాఖపట్నం రావడానికి ఒప్పందాలు చేసుకున్నాయి. అందులో ఒకటి టీసీఎస్ కాగా మరొకటి గూగుల్. ఐటీ పార్కులోని డల్లాస్ టెక్నాలజీస్ భవనంలో కార్యకలాపాలు ప్రారంభించాలని టీసీఎస్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం మరో విశేషం చోటుచేసుకుంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) ఇంకుబేషన్ సెంటర్ నిర్మాణానికి ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని 'ఆ హబ్' పక్కన ఎకరా స్థలంలో భూమి పూజ నిర్వహించింది. ఇక్కడ సుమారు రూ.30 కోట్ల వ్యయంతో ఐదు అంతస్థుల భవనం నిర్మిస్తారు. ఈ సెంటర్ విశాఖపట్నం నుంచి ఐటీ ఎగుమతులు పెంచడానికి కృషి చేస్తుంది. అదేవిధంగా చిన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తుంది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలో విద్యార్థులకు శిక్షణ కూడా ఇస్తుంది. ఏయూ విద్యార్థులకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది.

రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు..తొక్కిపెట్టిన వైసీపీ పెద్దలు

ఎస్‌టీపీఐకి రాష్ట్రంలో విజయవాడ, ... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్యానల్స్

జిల్లా అధికారుల యోచన

- ఈపీడీసీఎల్ అధికారులతో చర్చలు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- కార్యరూపం దాల్చితే తప్పనున్న కరెంట్ చార్జీల ఖర్చు
- ఇప్పటికే రూ.లక్షల్లో బకాయిలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సౌర విద్యుత్ (సోలార్ పవర్) ఉత్పత్తికి అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాన్నింటిపైనా ప్యానల్స్ ఏర్పాటుచేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. సోలార్ పవర్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద ప్రత్యేక పథకం తీసుకువచ్చి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వ్యక్తిగత గృహాలు, గ్రూపు హౌస్‌లు, అపార్టుమెంట్లపై సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు ఈపీడీసీఎల్ అధికారులు కొద్ది నెలలుగా కసరత్తు చేస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు లేని ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖపట్నం పోర్టు, నేవీ వంటివి ఇప్పటికే సోలార్ ప్లాంట్లను నిర్వహిస్తున్నాయి. జీవీఎంసీ ముడసర్లోవలో ఇప్పటికే ఒకటి ఏర్పాటుచేయగా, మేహాద్రి రిజర్వాయర్‌లో మరొకటి ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలపైనా సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేయాలనే ఆలోచన జిల్లా

... మిగతా 6వ పేజీలో

సహకార పదవులకు పోటీ



లాలం భవాని



గవిరెడ్డి రామానాయుడు



కోట్ని బాలాజీ

- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి పదవికి రేస్‌లో టీడీపీ నుంచి లాలం భవానీ, గవిరెడ్డి రామానాయుడు, కోట్ని బాలాజీ, కిలపర్తి భాస్కరరావు
- మరికొందరు కూడా యత్నం
- ప్రాథమిక సహకార సంఘాలకు త్వరలో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు... జాబితాల తయారీలో ఎమ్మెల్యేలు



కిలపర్తి భాస్కరరావు

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

సహకార శాఖ పరిధిలో గల డీసీసీబీ, డీసీఎంఎస్‌లతోపాటు ప్రాథమిక సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జుల నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున అప్పటివరకూ నామినేటెడ్ పాలక వర్గాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి సంకేతాలు రావడంతో కూటమి పార్టీల నేతల్లో పదవుల కోసం పోటీ నెలకొంది.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెట్ సొసైటీ (డీసీఎంఎస్) పర్సన్ ఇన్‌చార్జి పదవులకు తెలుగుదేశం నుంచి పలువురు పోటీ పడుతున్నారు. ప్రస్తుతానికి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, అనకాపల్లికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు రేస్‌లో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల నగరానికి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడును లాలం భవానీ కలిసి డీసీసీబీ చైర్మన్ పర్సన్ ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని కోరారు. ఈ విషయమై ఆమె ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇతర పెద్దలను కలిశారు. భవానీ ఎలమంచిలి నియోజక వర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు లాలం భాస్కరరావు సతీమణి. గతంలో ఆమెకు జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారు. ఎన్నికలకు కొద్ది నెలల ముందు భాస్కరరావు కన్నుమూశారు. ఇక, మాడుగుల మాజీ ఎమ్మెల్యే రామానాయుడు కూడా డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి రేస్‌లో ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేశానని, ఆ సమయంలో తనకు నామినేటెడ్ పదవి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆయన జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలను కలిశారు. తన పేరు పరిశీలించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తిచేశారు. ఎన్నికల ముందు టీడీపీలో చేరిన దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు కూడా డీసీసీబీ పదవి ఆశిస్తున్నారు. ఈ ముగ్గురూ వెలమ సామాజిక వర్గానికి చెందినవారు. వీరు కాకుండా అనకాపల్లి నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ కూడా డీసీసీబీ రేస్‌లో ఉన్నారు. ఇంకా మరికొందరు పార్టీ నాయకులు డీసీసీబీ, ... మిగతా 6వ పేజీలో

మారని మందుబాబులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా మందుబాబుల ధోరణి మాత్రం మారడం లేదు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. కోర్టు జైలు శిక్ష విధిస్తున్నా సరే మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారి సంఖ్య ఆశించిన స్థాయిలో తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో మరింత విస్తృతంగా తనిఖీలు చేపట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.



డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏటా సగటున 1,400 వరకూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యధిక ప్రమాదాలకు వాహన చోదకులు మద్యం సేవించి ఉండడమే కారణమని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా డ్రంకన్ డ్రైవ్ పేరుతో ఎక్కడికక్కడ బ్రీత్ అనలైజర్లతో తనిఖీలు చేయడం ప్రారంభించారు. ప్రతిరోజూ సాయంత్రం ఐదు నుంచి తెల్లవారుజామున ఆరు గంటల వరకూ ఈ తనిఖీలు చేస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడినట్టయితే మొదట్లో వాహనాలను సీజ్ చేసి, జరిమానా విధించేవారు. మరుసటిరోజు జరిమానా కడితే వాహనాన్ని విడుదల చేసేవారు. దీని వల్ల మందుబాబుల తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదని పోలీసులు ... మిగతా 6వ పేజీలో

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వైనం

- పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీ చేస్తున్నా ఫలితం శూన్యం
- ఈ ఏడాది ఇప్పటివరకూ రికార్డు స్థాయిలో 33,707 కేసులు నమోదు
- రూ.11.05 కోట్లు జరిమానా విధించిన కోర్టు
- 258 మందికి జైలుశిక్ష
- ఇంకా 11,587 కేసులు కోర్టులో పెండింగ్

డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు మరింత విస్తృతం చేస్తాం | సీపీ శంఖబ్రతబాగ్చి



మద్యం మనిషి నాడీ వ్యవస్థ పనితీరుపై ప్రభావం చూపుతుంది. దీనివల్ల మద్యం సేవించిన వ్యక్తి వాహనంపై నియంత్రణ కోల్పోతారు. అందుకే ప్రమాదాలు జరుగుతుంటాయి. గత ఆరు నెలలుగా తనిఖీలను ముమ్మరం చేశాం. పట్టుబడినవారు ఎంతటివారైనా, ఎవరు చెప్పినా విడిచిపెట్టకుండా కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. దీనివల్ల రోడ్డు ప్రమాదాలతోపాటు మరణాల సంఖ్యను తగ్గించగలిగాం. మద్యం తాగి వాహనం నడిపితే క్రిమినల్ కేసులను ఎదుర్కోనాల్సి వస్తుందని అందరూ గుర్తించాలి. మద్యం సేవించిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు ఉబర్, ర్యాపిడో, ఓలా వంటి వాటిని బుక్ చేసుకోవడమో...కుటుంబ సభ్యులు, స్నేహితుల సహాయం తీసుకోవడమో చేయాలి. నగరంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలను మరింత ముమ్మరం చేస్తాం.

ఈ ఏడాది నవంబరు 23 వరకూ డ్రంకన్ డ్రైవ్ కేసులు వివరాలు

నమోదుచేసిన కేసులు	33,707
కోర్టులో తీర్పువచ్చినవి	22,120
పెండింగ్‌లో ఉన్నవి	11,587
విధించిన జరిమానా	రూ.11.05 కోట్లు
జైలుశిక్ష పడినవారు	258
సమాజ సేవ శిక్షపడినవారు	40

మూడు రోజుల్లో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్

- పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ కూడా ఏడు రోజుల్లోపు జారీ
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఎవరైనా పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకుంటే పోలీస్ వెరిఫికేషన్ ఇకపై మూడు రోజుల్లో పూర్తిచేస్తామని సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందనే ఫిర్యాదులు వస్తుండడంతో సీపీ స్పందించారు. వెరిఫికేషన్ మూడు రోజుల్లోపు పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. అలాగే వివిధ కంపెనీలు, ప్రైవేటు సంస్థల నుంచి వచ్చే పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ జారీ కూడా ఏడు రోజుల్లోపు పూర్తిచేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన వారికి జాబ్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ కూడా ఏడురోజుల్లోగానే అందజేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. పైన పేర్కొన్న సేవలు ఎవరికైనా నిర్ణీత వ్యవధిలో పూర్తికానట్టయితే 7995095799 నంబర్‌కు ఫోన్‌లో సంప్రతించాలని సీపీ కోరారు.

జాయ్ జమీమా కేసు...

మరో ముగ్గురి అరెస్టు ... మెయిన్‌లో

కలకలం రేపుతున్న హనీ ట్రాప్ కేసు

ఈ కేసులో ఇప్పటికే ముగ్గురి అరెస్టు

మాతృ వందన యోజన సాయం విడుదల

- ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం లబ్ధిదారులకు కొంతకాలంగా చెల్లింపులు నిలిపివేత
- కేంద్రం ఇచ్చిన నిధులనూ మళ్లించిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ బిల్లులపై దృష్టి
- జిల్లాలో 5,478 మందికి సుమారు రూ.కోటిన్నర విడుదల

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వం బకాయిపెట్టిన మొత్తాన్ని కూటమి ప్రభుత్వం దఫదఫాలుగా విడుదల చేస్తోంది. మొదట విడతగా సుమారు రూ.కోటిన్నర లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేసింది. రెండో విడత కూడా త్వరలో మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు.

గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకునేందుకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2017 నుంచి ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. తొలి కాన్పు అయితే రెండు విడతల్లో రూ.5 వేలు సాయాన్ని అందిస్తున్నాయి. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే ఒక విడతలో రూ.6 వేలు ఇస్తాయి. ఈ మొత్తంతో తల్లి, బిడ్డ పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. ఈ పథకం కింద లబ్ధిదారులకు మంజూరుచేసే మొత్తంలో కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం వాటా 40 శాతం. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఏడాది నుంచి లబ్ధిదారులకు నిధుల చెల్లింపును పెండింగ్‌లో పెట్టేసింది. కేంద్రం తన వాటాగా ఇచ్చిన నిధులను కూడా ఇతర అవసరాలకు మళ్లించేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని నీరుగార్చేలా వైసీపీ వ్యవహరించిన తీరును గుర్తించింది. వెంటనే లబ్ధిదారులకు చెల్లించాల్సిన బకాయిల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోపాటు అందుకు అవసరమైన నిధులను మంజూరు చేసింది. మూడు వారాల కిందట జిల్లాలో లబ్ధిదారులకు సుమారు రూ.కోటిన్నర విడుదల చేసింది. సుమారు 4,022 మందికి రూ.1,41,21000ను నేరుగా ... మిగతా 6వ పేజీలో



వైభవంగా గోదాదేవి తిరువీధి

సింహాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వేకువజామున ప్రభాత ఆరాధనలు తరువాత ఉత్సమూర్తిని పుష్పమాలికలతో అలంకరించి,ప్రత్యేక పల్లకిలో అధిష్ఠింపజేశారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణలు నడుమ బేడా మండపంలో గోదాదేవి తిరువీధి జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలోని ఆండాళ్ అమ్మవారి సన్నిధానంలో అధ్యాపకులు తిరుప్పావైలోని పదవ పాశురాన్ని విన్నపాలు చేశారు. అలాగే కొండ దిగువ స్వామివారి పూదోటలో కొలువై ఉన్న అలిమేల్‌మంగా, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి సన్నిధిలోనూ ఉత్సవ మూర్తిని గోదాదేవిగా అలంకరించి, తిరుప్పావై పాశురాన్ని ఆలపించారు.

కన్నుల పండువగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

'భువనేశ్వర్‌కు విమాన సర్వీసు నడపాలి'



హరిబాబును అభినందిస్తున్న దృశ్యం

విశాఖపట్నం,డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మిజోరం గవర్నర్‌గా పనిచేస్తూ తాజాగా ఒడిశా గవర్నర్‌గా నియమితులైన కంభంపాటి హరిబాబును బుధవారం ఆయన ఇంట్లో పలువురు నగర ప్రముఖులు కలిసి అభినందించారు. విశాఖ విమానాశ్రయం సలహా కమిటీ సభ్యులు ఓ.నరేశ్‌కుమార్, డీఎస్ వర్మ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు విమాన సర్వీసు నడిపేలా కృషి చేయాలని కోరారు.

హరిబాబుకి అభినందనలు

ఎండాడ : ఒడిశా గవర్నర్‌గా నియమితులైన కంభంపాటి హరిబాబును ఆయన నివాసంలో జనసేన 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారు హరిబాబును ఘనంగా సన్మానించారు.

సీపీఎం బైక్ ర్యాలీ

తగరపువలస,డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలో ఈనెల 28, 29 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పార్టీ నాయకులు తగరపువలసలో బుధవారం బైక్ ర్యాలీ చేశారు. ర్యాలీని చిట్టివలస పార్టీ కార్యాలయం వద్ద 78వ వార్డు కార్పొరేటర్ బిగంగారావు ప్రారంభించారు. గొల్లవీధి, బైపాస్ రోడ్డు, తాతా థియేటర్ మీదుగా ర్యాలీ సాగింది.ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఆర్. నరసింగరావు, ఎస్. అప్పలనాయుడు, నీలాతి రాము, తదితరులు పాల్గొన్నారు.

కళా విహీనంగా బీచ్ పార్క్



పార్క్‌లో షార్క్ చేపల బొమ్మలు గతంలో ఇలా ఉండేవి.

భీమునిపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ పార్క్ కనీస నిర్వహణకు నోచుకోక కళా విహీనంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వం పార్కు నిర్వహణను కనీసం పట్టించుకున్న పాపానపోలేదు. ముఖ్యంగా పార్కులో ఏర్పాటు చేసిన షార్క్ చేపల బొమ్మలు నిర్వహణ లోపం వల్ల కళా విహీనంగా కనిపిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం సందర్శకులను ఆకట్టుకోవడానికి జీవీఎంసీ ఒక చెట్టు కొమ్మకు నాలుగు షార్క్ చేపల బొమ్మలు వేలాడుతున్నట్టు ఏర్పాటు చేసింది. అయితే అధికారుల నిర్వహణ లోపం వల్ల బొమ్మలు రంగు వెలసిపోయి కళావిహీనంగా తయారయ్యాయి. దీనికితోడు వారం రోజులుగా పడుతున్న వర్షాలకు బొమ్మలకు అతికించిన గమ్ నానిపోవడంతో ఒక్కొక్కటి చెట్టు కొమ్మ నుంచి జారి కింద పడుతున్నాయి. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి చేపల బొమ్మలకు రంగు వేయడంతో పాటు గమ్ అంటించి గతంలా ఉండేలా చూడాలని సందర్శకులు కోరుతున్నారు.



ప్రస్తుతం రంగు వెలసిపోయి, కింద పడి ఉన్న బొమ్మలు

క్రీస్తు సందేశం సమాజానికి మార్గదర్శకం

క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్లు



భీమిలి ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో ఆరాధనలు



కొమ్మాది : మధురవాడలో క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న సింగ్

భీమునిపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం అర్థరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. భీమిలిలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ క్వర్క్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ చార్లీ మోజెస్ దైవ వాక్యములు చదివి వినిపించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ గిడియన్ విజయ్‌కుమార్ ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు చదివారు.ఈ ఆరాధనలు చర్చి సంఘం అధ్యక్షుడు వై. లివింగ్ స్టన్ నతానియేలు అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమంలో చర్చి డీకెన్ బోర్డు ఛైర్మన్ పి. శామ్యూల్ రాజు, జేడీ ఆనందకుమార్, ఎం. రామారావు, సంఘ కార్యదర్శి జె. ఆల్బర్ట్ సుదర్శన్, కె. ప్రేమానందరావు, స్టీవెన్, వై. నతానియేలు, ఎస్. కేశవరావు, శామ్యూల్ దాస్, విమలా కుమారత్నం, మార్గరెట్, విజయమ్మ రోనాల్డ్ పాల్గొన్నారు. కీటిన్‌పేట సెయింట్ పీటర్స్ చర్చి, నెహ్రూరోడ్‌లో వున్న రోమన్ కేథోలిక్ చర్చి, సెయింట్ ఆన్స్ హోమ్‌లో కేథలిక్ చర్చిల్లోనూ క్రిస్మస్ ఆరాధనలు జరిగాయి.

తగరపువలస : తగరపువలస మెయిన్ రోడ్డులో ఉన్న ఆంధ్రా బాప్టిస్టు చర్చిలోనూ వేడుకలు నిర్వహించారు. తగరపువలస, చిట్టివలస ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు తరలిరాగా చర్చి అధ్యక్ష, కార్యదర్శులు జాన్ ప్రకాశ్, జోసప్ జేమ్స్, పాస్టర్ సునీత క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు, వైసీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఉప్పాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎండాడ : ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న సెయింట్ లూక్స్ నర్సింగ్ కళాశాలలో ఆ సంస్థ అధినేత ప్రేమ్ లూక్స్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది కళాశాల ఆవరణలో ఏసు క్రీస్తు చరిత్రను తెలియజేసేలా బొమ్మలు ఏర్పాటు చేశారు.

మధురవాడ / కొమ్మాది : క్రీస్తు సందేశం నేటి తరానికి ఆచరణీయమని రెవరెండ్ కేఆర్ సింగ్ అన్నారు. మధురవాడ పరిసరాల్లోని ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పరదేశిపాలెం యూసీఐఎం, పీఎం పాలెం లవ్ అండ్ కేర్, మిథిలాపురి వుడాకాలనీలోని ఎస్ఎఫ్ఎస్, మధురవాడ ట్రినిటీ, స్వతంత్రనగర్ కాలనీలోని నెనెన్యా చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు సందేశం వినిపించారు. పీఎం పాలెం బేతనీ చర్చిలో రెవరెండ్ పి. ఏసుపాదం మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో పాటు నిరాశ్రయులకు చేయూత అందించాలని క్రీస్తు ప్రబోధించారని పేర్కొన్నారు.

పద్మనాభం/రూరల్ : పద్మనాభం, రెడ్డిపల్లి, తునివలస, సత్యనారాయణపురం, కోరాడ, అనంతవరం, వీకే పాలెం, అర్చుకునిపాలెం, కృష్ణాపురంలో వేడుకలు జరిగాయి. పలుచోట్ల క్రీస్తు జన్మించిన పశువుల పాక నమూనాలను, క్రిస్మస్ ట్రీ నెలకొల్పి ప్రార్థనలు చేశారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న నూకరాజు

భీమునిపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. వార్డులో నేరెళ్లవలస కాలనీ, బోయవీధి, గొల్లలపాలెం, కృష్ణాకాలనీ, ఎగువపేట, గొల్లవీధి, తోటవీధి ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో ఉంటున్నాయని, కొత్తగా స్తంభాలు వేసి, విద్యుత్ సదుపాయం కల్పించాలని విన్నవించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మధురవాడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో 1980, 1981-82లో చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం మధురవాడ శిల్పారామంలో కలుసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల కళాశాలల సమన్వయకర్త ఎస్.రూపావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకొని తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మధుసూదనరావు, జనార్దనరావు, ప్రభాకరరరావు, కూర్మేశ్వరరావు, ప్రభాకర శర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హేమలత, సుధారాణి, వెంకటేశ్వర దాసు, పడాల బాబ్జీ, పి. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజపేయి శత జయంతి

ఆనందపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకిలో ఉన్న బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ విశాఖ జిల్లా కిషాన్ మోర్చ అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు పట్నాయక్, ఉప్పాడ అప్పారావు, మీసాల రామునాయుడు, తదితరులు వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతరత్న వాజపేయి రాజకీయవేత్త మాత్రమే కాదని గొప్ప రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. గ్రామీణ సడక్ యోజన, సర్వశిక్ష అభియాన్, ఫోఖ్రాన్ పరీక్షలతో దేశాన్ని ఒక శక్తిగా మార్చి నిజమైన సుపరిపాలన ఎలా ఉంటుందో చూపిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతిన జీవన్ సంతోష్, పిల్లా సూర్యనారాయణ, కొలును శ్రీను, కేవీవీ సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనంతుని ఆలయంలో నవనీత ఉత్సవం రేపు

పద్మనాభం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుడి క్షేత్రంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా దాతల సహకారంతో శుక్రవారం నవనీత ఉత్సవం నిర్వహించడానికి దేవస్థానం ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు. ఉత్సవంలో భాగంగా కుంతీమాధవస్వామి మూలవిరాట్లను వెన్నతో అలంకరించి నవనీతధారియైన స్వామి దర్శనాన్ని భక్తులకు కల్పిస్తారు.



ఆలయంలో భక్తుల రద్దీ

సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి దర్శనానికి భవానీ భక్తులు బుధవారం అధిక సంఖ్యలో పోటెత్తారు. విజయవాడ దుర్గమ్మ ఆలయంలో ఈనెల 21న ప్రారంభమైన చండీ యాగం నుంచి ఇప్పటివరకు ప్రతిరోజూ వందల సంఖ్యలో తరలివస్తున్నారు. కొండదిగువ పుష్కరిణిలో, సింహగిరిపై గంగధారలో స్నానాలు ఆచరించి, తలనీలాల మొక్కుబడులు చెల్లించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. భవానీల టూరిస్టు బస్సులతో కొండదిగువ పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి. అలాగే క్రిస్మస్ సెలవు రోజు కావడంతో సింహగిరికి సాధారణ భక్తులు కూడా అధిక సంఖ్యలోనే వచ్చారు. దీంతో కొండపై రద్దీ నెలకొంది.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి : సీపీఎం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆనందపురం, డిసెంబరు 25 ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసులువాడలో మైనింగ్ తవ్వకాలు జరగకుండా ప్రజలంతా తిప్పికొట్టాలని సీపీఎం నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన గ్రామంలో పర్యటించి, మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని నిరసిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలోని సర్వే నెంబరు 104 తెల్లకొండ (ఎద్దు మెట్ట)లో క్వారీ అనుమతులు కోరుతూ ఆగస్టు 28న నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలంతా వ్యతిరేకించడంతో అధికారులు వెనుతిరిగారన్నారు. ఇటీవల రహస్యంగా వీఆర్ ఇన్ఫ్రా టెక్నాలజీ సంస్థ ప్రకటనలు ఇచ్చి ఈనెల 28న మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడానికి సన్నాహాలు చేస్తుందని తెలిపారు. దీన్ని కూడా అందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మైనింగ్ తవ్వకాలు వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు నష్టం కలగడంతో పాటు గాలి, తాగునీరు కలుషితమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, ఐద్వా నాయకురాలు నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జాతర గుట్టపై వెలసిన దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈనెల 29, 30, 31 తేదీల్లో జరగనున్నట్టు ఆలయ ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవం మూడు రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయడంతో పాటు చివరి రోజు మహా అన్నదానం నిర్వహించనున్నట్టు చెప్పారు.



పేదలకు నిత్యావసర సరకులు అందిస్తున్న ఉమర్ అలీషా

ఆధ్యాత్మిక భావంతో మానసిక ప్రశాంతత

భీమునిపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం అధిపతి సద్గురు డా. ఉమర్ అలీషా అన్నారు. బుధవారం బీచ్‌రోడ్‌లో వున్న ఆ పీఠం భీమిలి శాఖ 23వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావం మనుషుల్లో సేవా స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ సేవా భావంతో మెలిగి సమాజ హిత కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్త పరవస్తు ఫణి శయనసూరి ఆలపించిన పద్యాలు సభికులను అలరించాయి. అలాగే పేదలకు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో ఏయూ తెలుగు విభాగాధిపతి డా. వెంకటేశ్వర యోగి, ప్రముఖులు మనోజ్ కుమార్ జైన్,ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ పింగళి ఆనంద్ కుమార్, రాధాస్వామి సత్సంగం ప్రతినిధి గణపతిరాజు, రాధాకృష్ణ, భీమిలి శాఖ ప్రతినిధులు రామారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

భీమునిపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యులు నిరుపేద కుటుంబానికి బుధవారం రూ. 10 వేల అందించారు. స్థానిక పాస్టర్ సురేంద్ర కరోనా సమయంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి క్రిస్మస్ పురస్కరించుకుని ఈ నగదు అందించారు. కార్యక్రమంలో ఫ్యాబ్ సభ్యులు విజ్ఞపు సత్యనారాయణ, గుగ్గిళ్ళ సాయి, కట్టుమూరి అశోక్, పెంటపల్లి దేవానంద్, మొకర శ్రీరామ్మూర్తి, కట్టమూరి రమణారావు, కందివలస నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

స్వయంకృషినగర్‌లో రగ్గులు పంపిణీ

కొమ్మాది, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శాంతి, కరుణ, ప్రేమకు ఏసుక్రీస్తు ప్రతీక అని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా స్వయం కృషి నగర్‌లో విజయరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు.

'తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి'

పద్మనాభం రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడు దల చేశారు. వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను అధికారులు ఆదుకోవాలన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు

అప్పన్న వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

సింహాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పండితులు రూపొందించిన 2025 ఆంగ్ల సంవత్సర వార్షిక క్యాలెండర్‌ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతి రాజు బుధవారం విజయనగరంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో వేంద్ర త్రినాధరావు మాట్లాడుతూ ఆలయంలో ఏడాది మొత్తం నిర్వహించే ఉత్సవాల వివరాలు క్యాలెండర్‌లో పొందుపరిచారన్నారు. త్వరలో సింహగిరిపై భక్తులకు విక్రయిస్తామన్నారు. గత ఏడాదిలానే సింగిల్‌పేజీ, ఆరు పేజీల క్యాలెండర్లు ముద్రించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇంజనీర్లు డీజీ శ్రీనివాసరాజు, బి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

28న భీమిలిలో ఉచిత వైద్య శిబిరం

భీమునిపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 28న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కళాశాల 1981-83 బ్యాచ్ పూర్వ విద్యార్థుల కన్వీనర్లు మైలపల్లి లక్ష్మణరావు, డీవీవీ రామకృష్ణ తెలిపారు. బుధవారం వారు ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఈ శిబిరాన్ని బ్యాచ్ పూర్వ విద్యార్థి, ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషినల్ డైరెక్టర్ వీఎం మహిధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. కళాశాల విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఐటీ అభివృద్ధికి ఊతం

... 5వ పేజీ తరువాయి

కాకినాడ, తిరుపతి నగరాల్లో ఇంకుబేషన్ సెంటర్లు ఉన్నాయి. అత్యంత కీలకమైన విశాఖపట్నంలోనే సెంటర్ లేదు. గతంలో వీఎంఆర్‌డీఏతో రూ.40 కోట్లకు ఒప్పందం చేసుకున్నారు. నిర్మాణ పనుల పర్యవేక్షణ విషయంలో విభేదాలు రావడంతో అది ఆగిపోయింది. విశాఖ ఎస్‌టీపీఐ జాయింట్ డైరెక్టర్ ఎలాగైనా విశాఖలో ఇంకుబేషన్ సెంటర్ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని నిర్ణయించి ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులను సంప్రతించారు. ఏయూలో ఎకరా స్థలం కేటాయిస్తే.. అందులో 100 సీట్ల సామర్థ్యంతో ఇంకుబేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రతిపాదనలు ఇచ్చారు. అంతేకాకుండా దువ్వాడలోని ఎస్‌టీపీఐ ప్రధాన కార్యాలయాన్ని కూడా ఇక్కడికే తీసుకువచ్చేస్తామని చెప్పారు. ఇది విశాఖలో ఐటీ అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఏయూ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి 2022 జూన్‌లో నివేదిక పంపారు. దీనిపై విద్యా శాఖ నిర్ణయం తీసుకోవలసి ఉందని చెప్పి ఫైల్ పక్కన పెట్టేశారు. ఇప్పుడు ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రిగా లోకేశ్ ఉండడం, విశాఖలో ఐటీ ప్రతినిధులు ఎస్‌టీపీఐ భూమి విషయం ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఫైల్ క్లియర్ చేశారు. ఎస్‌టీపీఐ కోరిన ఎకరా భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దాంతో ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్ బుధవారం భూమి పూజ చేశారు. వీలైనంత త్వరగా సెంటర్ నిర్మాణం పూర్తిచేయాలని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావును కోరగా...తప్పకుండా చేస్తామని అరవింద్‌కుమార్ హామీ ఇచ్చారు.

సోలార్ పవర్ ప్యానల్స్

... 5వ పేజీ తరువాయి

అధికారులకు వచ్చింది. వెంటనే ఈపీడీసీఎల్ అధికారులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు ఏవీ సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. అన్ని విభాగాలూ లక్షల రూపాయల్లో బకాయి ఉన్నాయి. ఇవి ఈపీడీసీఎల్‌కు కూడా గుదిబండగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు ఉపయుక్తంగా ఉండేలా ప్రతి ప్రభుత్వ కార్యాలయంపైనా ప్యానళ్లు ఏర్పాటుచేసి సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని, అవసరమైనంత ఉపయోగించుకుని, మిగిలింది గ్రిడ్‌కు సరఫరా చేయాలని నిర్ణయించారు.

జిల్లాలో 11,257 ప్రభుత్వ కార్యాలయాలు

జిల్లా ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్న వెంటనే ఈపీడీసీఎల్ అధికారులు రంగంలో దిగారు. జిల్లాలో మొత్తం 11,257 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నట్టు లెక్క తేల్చారు. ఏడాదికి లక్ష యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించే ప్రభుత్వ కార్యాలయాల్లో మొదట సోలార్ ప్యానళ్లు పెట్టాలని తీర్మానించారు. ఇవి ఒక్కొక్కటి 150 కిలోవాట్లకు పైగా సామర్థ్యం కలిగినవని ఈపీడీసీఎల్ ఉన్నతాధికారి తెలిపారు.వీటికి అయ్యే వ్యయం, ఇతర మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావలసి ఉంది. అవి అందిన వెంటనే పనులు ప్రారంభిస్తారు.

సహకార పదవులకు పోటీ

... 5వ పేజీ తరువాయి

డీసీఎంఎస్ రేసులో ఉన్నారని, అయితే వారిలో కొందరు తమ పేర్లు బయట పెట్టకుండా ఎమ్మెల్యేలను కలవడంతోపాటు అధిష్ఠానాన్ని కలిశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. డీసీసీబీ, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవులు ఒకే వర్గానికి కాకుండా రెండు ప్రధాన సామాజిక వర్గాలకు ఇస్తే సమతుల్యత పాటించినట్టు అవుతుందని పార్టీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. జిల్లాలో 98 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించనున్నందున గ్రామ స్థాయి నాయకుల పేర్లతో జాబితాలు రూపొందించే పనిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. త్వరలో 98 సంఘాలకు సంబంధించిన జాబితాలను అధిష్ఠానానికి పంపనున్నారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో నామినేటెడ్ పదవులు పంపిణీ చేయనున్నారు.

మారని మందుబాబులు

... 5వ పేజీ తరువాయి

పంథా మార్చారు. జరిమానా విధించి వదిలేయకుండా కోర్టులో హాజరుపరచడం మొదలుపెట్టారు. కోర్టు విచారణ జరిపి మొదటిసారి పట్టుబడిన వారికి రూ.పది వేలు జరిమానా విధించడం, రెండోసారి అయితే జైలు శిక్ష విధించడం చేస్తోంది. దీనివల్ల మందుబాబుల తీరు మారుతుందని అంతా భావించారు. కానీ ఆశించిన స్థాయిలో మార్పు కనిపించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ పోలీసులు 33,707 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వాటిలో 22,120 కేసులను న్యాయస్థానాలు ఇప్పటికే పరిష్కరించాయి. నిందితులకు రూ.11.05 కోట్లు జరిమానా విధించాయి. ఈ కేసుల్లో 258 మందికి జైలు శిక్ష పడింది. ఇంకా 11,587 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

మాతృ వందన యోజన సాయం విడుదల

... 5వ పేజీ తరువాయి

లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం కింద తొలిసారి గర్భం దాల్చిన మహిళకు ఐదు వేల రూపాయలు అందిస్తారు. జిల్లాలో 5,478 మందికి మొదటి, రెండు విడతలకు సంబంధించిన సొమ్ము చెల్లించాల్సి ఉంది. 3,591 మందికి తొలి విడత నిధులు చెల్లించాల్సి ఉండగా, 2,861 మందికి రూ.2 వేలు చొప్పున రూ. 85,83,000 జమ చేశారు. అలాగే, రెండో విడతకు సంబంధించి 1004 మందికిగాను 357 మందికి మూడు వేలు చొప్పున రూ.7,14,000 చెల్లించారు. మిగిలిన వారికి కూడా కొద్దిరోజుల్లోనే నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే, రెండో కాన్పులో ఆడ పిల్ల పుట్టిన వారికి ఈ పథకం కింద ఆరు వేలు చొప్పున అందిస్తారు. అందుకు 2,347 మంది అర్హులుగా అధికారులు గుర్తించారు. ఈ దరఖాస్తులు గడిచిన కొద్ది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వీరిలో 804 మందికి రూ.6 వేలు చొప్పున రూ. 48,24,000 చెల్లించారు. కొన్ని నెలలు నుంచి పెండింగ్‌లో ఉన్న మొత్తాలను చెల్లించడం పట్ల లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

2025లో రెండుసార్లు ఉత్తర ద్వార దర్శనం

సింహాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిలో ఒకసారి మాత్రమే భక్తులకు స్వామివారి ఉత్తరద్వార దర్శనం లభిస్తుంటుంది. కానీ 2025లో రెండుసార్లు ఆ అవకాశం లభించనుంది. ఏటా ధనుర్మాసంలో పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశి రోజున వైష్ణవాలయాల్లో ఉత్తరద్వార దర్శనం లభిస్తుంది. ఈ క్రమంలో 2025 జనవరి 10న వైకుంఠ ఏకాదశి కావడంతో ఉత్సవ నిర్వహణకు సింహాచలం దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా అదే ఏడాది డిసెంబరు 30న కూడా వైకుంఠ ఏకాదశి పర్వదినం వచ్చిందని పంచాంగకర్తలు వివరించారు. దీంతో ఒకే ఏడాదిలో భక్తులకు రెండుసార్లు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం లభించనుంది.

డ్రైనేజీలను కప్పేస్తున్నారు

- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- 15, 16 వార్డుల్లో రోడ్లపైకి వస్తున్న మురుగు నీరు
- పట్టించుకోని గ్రేటర్ అధికారులు
- పూడికలు తీసే అవకాశం లేకపోవడంతో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ

వెంకోజీపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తమ స్వప్రయోజనాల కోసం ఏ మాత్రం సామాజిక అవసరాలను పట్టించుకోకుండా నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు సాగిస్తున్నా జీవీఎంసీ అధికార యంత్రాంగం కిమ్మనడం లేదు. జీవీఎంసీ 15, 16 వార్డులోల పలు చోట్ల వివిధ నిర్మాణాలు చేపడుతున్న వారు తమ అవసరాలకు అనుగుణంగా దుకాణాలు, నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సామాజిక అవసరమైన కాలువ నిర్మాణం గురించి ఆలోచించడమే లేదు. కాలువలను కప్పేస్తూ నిర్మాణాలు సాగిస్తున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయిన తరువాత అసలు అక్కడ కాలువ ఉందనే విషయం కూడా గుర్తించలేని విధంగా పరిస్థితి ఉంటోంది. కాలువలు కనిపించకుండా కప్పి వేస్తుండడంతో పారిశుధ్య కార్మికులు పూడికలు తీసే అవకాశమే లేకుండా పోతోంది. కాలువల్లో పూడికలు నిలిచిపోయి మురుగు ప్రవహించక తీవ్ర దుర్గంధం వెలువడుతుంటుంది. దీంతో ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా

ఈ ప్రాంతంపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు దృష్టి సారించి కాలువ నిర్వహణకు ఇబ్బందిగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని, ఇకపై అలాంటి నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కాలువ ఆనవాళ్లు కనిపించకుండా కట్టిన ప్లాట్‌ఫాం


వర్షం పడడంతో నీరు రోడ్డు పైకి చేరడంతో బురదమయంగా మారిన మార్గం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మెప్మా బజార్ ప్రారంభోత్సవంలో ఎంపీ గొల్ల బాబూరావు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల మేళాను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎంవీపీ కాలనీలోని అల్వార్‌దాస్ మైదానంలో ఐదురోజులు నిర్వహించే మేళా ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళల స్వయం సమృద్ధికి అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నారన్నారు. సుమారు వంద స్టాళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలు స్టాల్స్ ఏర్పాటుచేశారని, వివిధ రకాల ఉత్పత్తులను కొనుగోలు చేసి సహకరించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ మేళా ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్టాళ్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు సందర్శించి, వ్యాపారులు, డ్వాక్రా సంఘాల మహిళలతో సంభాషించారు. మేళా నిర్వహణకు కేంద్రం రూ.25 లక్షలు మంజూరు చేసిందని యూసీడి పీడీ సత్యవేణి తెలిపారు. డ్వాక్రా మహిళలందరికీ స్టాల్స్ ఉచితంగా కేటాయించామని, 20 ఫుడ్ స్టాల్స్‌కు లాటరీ వేశామన్నారు. జీవీఎంసీ పరిధిలోని డ్వాక్రా సంఘ సభ్యులంతా ప్రదర్శన తిలకించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆవరణలో ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వస్త్రాలు, ఒన్ గ్రామ్ గోల్డ్ ఐటమ్స్, ఆట, అలంకరణ వస్తువులు, తినుబండారాల స్టాళ్లు ఏర్పాటుచేశారు. మొదటి రోజు పది వేల మంది మహిళలు హాజరైనట్టు అధికారులు తెలిపారు.


చీరలను పరిశీలిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే వెలగపూడి,


మెప్మా బజార్‌కు పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు

ముగిసిన దేశ్ కీ ప్రకృతి పరీక్షాన్ అభియాన్


మాట్లాడుతున్న ఆయుష్ ప్రాంతీయ సంచాలకులు ఝాన్సీలక్ష్మి

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించేందుకు వీలుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన దేశ్ కీ ప్రకృతి పరీక్షాన్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా ముగిసిందని ఆయుష్ ప్రాంతీయ సంచాలకులు డి.ఝాన్సీ లక్ష్మి తెలిపారు. సంస్థ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ గతనెల 26 నుంచి బుధవారం వరకు అవగాహన శిబిరాలను నిర్వహించామన్నారు. సుమారు 5,965 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. శిబిరాల్లో సీనియర్ వైద్యులు పి.జగదీష్, ఎం.ఆనందరావు, వి.సీతామహలక్ష్మి, బి.సునీత, ఎస్.శ్రీనివాసరావు, బి.పద్మావతి, ఎస్.లక్ష్మీ సౌజన్య సేవలందించారని తెలిపారు.

వంటగ్యాస్ లీకై మంటలు : ఐదుగురికి గాయాలు

- విమ్స్‌కు తరలింపు, ఎమ్మెల్యే వెలగపూడి పరామర్శ
- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారు

ఆరిలోవ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 10వ వార్డులోని ఇందిరానగర్‌లో బుధవారం రాత్రి 9:30 గంటల సమయంలో ఓ ఇంట్లో మహిళ వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలైనట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. గాయాలైన వారిలో సత్యవతికి (28) 50 శాతం, చంద్రశేఖర్ (13)కు 25 శాతం, రాజశేఖర్ (11)కు 45 శాతం, పి.వెంకటేశ్వరరావు (30)కు 20 శాతం గాయాలు కాగా, జస్మిత (1)కు తలకు గాయమైంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం విమ్స్‌కు తరలించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, స్థానిక కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ విమ్స్‌ను సందర్శించి బాధితులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని విమ్స్ డైరెక్టర్ రాంబాబును ఎమ్మెల్యే ఆదేశించారు.


విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఈ ఘటన నేపథ్యంలో ఇందిరానగర్‌లో ఆందోళన నెలకొంది. కాగా, సత్యవతి స్థానికంగా ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తోంది. బుధవారం రాత్రి ఇంటికి వచ్చి వంట చేసేందుకు సిద్ధమవగా ఈ ప్రమాదం సంభవించినట్టు తెలిసింది. ఈ ఘటనపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాజపేయికి ఘన నివాళి


వాజపేయికి నివాళులు అర్పిస్తున్న మధుకర్, బీజేపీ నేతలు

పెదవాల్తేరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహార్ వాజపేయి శత జయంతిని పురస్కరించుకొని సుపరిపాలన దినోత్సవాన్ని జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులో బుధవారం భారతీయ జనతా యువమోర్చా విశాఖపట్నం జిల్లా కార్యదర్శి రోహిత్ కల్కి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ పార్టీ ఆంధ్ర రాష్ట్ర సంఘటన్ మంత్రి ఎస్.మధుకర్ పాల్గొని వాజపేయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 158వ బూత్ కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ఆర్ఎల్ఎన్ మురళీమోహన్‌రాజు, భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దోని నాగరాజు, శివాజీపాలెం మండల అధ్యక్షుడు ధనరాజ్ నాయక్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వాడమోదుల స్పందన, 158వ బూత్ అధ్యక్షుడు మరడ హరినాథ్‌రెడ్డి, చేనేత సెల్ కన్వీనర్ తెడ్లపు అప్పారావు, వెంకటలక్ష్మి, వాసుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

ఆరిలోవ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న 24వ సీపీఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్ కుమార్ కోరారు. బుధవారం సీపీఎం స్థానిక కార్యాలయం వద్ద ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆరిలోవ కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి కింద స్థాయి నుంచి అఖిల భారత కమిటీల వరకు మహాసభలు జరుగుతాయన్నారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఈసారి పెందుర్తి మండలం సుజాతనగర్‌లోని ఇంద్రాణి ఫంక్షన్ హాలులో జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు ముందు 27వ తేదీ ఉదయం 10 గంటలకు పెందుర్తి జూనియర్ కళాశాల నుంచి భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు సీహెచ్ నర్సింగరావు, కె.లోకనాథం, ఎంవీఎస్ శర్మ తదితరులు విచ్చేయనున్నట్టు చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా పార్టీ నిర్వహించిన పోరాటాలను సమీక్ష చేసుకొని భవిష్యత్తు కార్యాచరణకు రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ప్రదర్శన అగ్రభాగంలో కళారూపాలు, రెడ్ షర్టు వలంటీర్ల కవాతు, అనంతరం కళారూపాల ప్రదర్శన ఉంటుందని కుమార్ తెలిపారు.. మహాసభకు జిల్లా నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం ఆరిలోవ నాయకులు వి. నరేంద్రకుమార్, పి శంకర్, బి.నాగరాజు, ఎస్.రంగమ్మ, అన్న పూర్ణ గౌరి కాంతం, భాసకర్ గోపి, సూర్యనారాయణ , రవనమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా అథ్లెటిక్స్ మీట్‌కు హర్షిణి, కౌశిక్, బాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషులు, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌కు వాల్తేరు రైల్వే గ్రౌండ్ అథ్లెట్లు కౌశిక్, హర్షిణి, బాలు ఎంపికయ్యారు. కిట్స్ యూనివర్సిటీలో జరిగే ఈ టోర్నీ పురుషుల 100 మీ., 200 మీ. రేస్‌లో కె.కౌషిక్, 400 మీ. హర్డిల్స్‌లో బాలు, మహిళల 400 మీ. రేస్, 400 మీ. హర్డిల్స్‌లో నాగసాయి వర్షిణి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావులు బుధవారం రైల్వే గ్రౌండ్‌లో అథ్లెట్లతోపాటు కోచ్ పిట్టా శ్రీనివాసరావును అభినందించారు.



☛ సంక్షిప్తంగా..

స్టీల్‌ప్లాంట్‌లో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీ (గాట్), టెక్నీషియన్ అప్రెంటీస్ ట్రైనీ (టాట్)కు ఉక్కు యాజమన్యం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది గాట్ 200 పోస్టులు, టాట్ 50 పోస్టులను భర్తీ చేయనున్నారు. గాట్‌కు గ్రాడ్యుయేషన్, టాట్‌కు డిప్లొమా విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌కు రూ.9 వేలు, టాట్‌కు రూ.8 వేలు స్టయిఫెండ్ చెల్లించనున్నారు. 2022, 2023, 2021లో గ్రాడ్యుయేషన్, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జనవరి 9వ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఉక్కు యాజమాన్యం పేర్కొంది.

నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శివాజీ పార్కు ఆవరణలో శివాజీ పార్కు గొడుగు వాకర్స్ అసోసియేషన్ బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించి, నూతన కార్యవర్గం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడుగా ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణ, కార్యదర్శిగా వి.సత్యనారాయణ, కోశాధికారిగా ఎం.నందకుమార్, జాలి వాకర్‌గా అప్పరాజు, మరో తొమ్మిది మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా వీఎస్ఆర్‌కే ప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలు తొలగింపు


ఆక్రమణలు తొలగించిన గ్రీన్‌బెల్ట్

మద్దిలపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీ జాతీయరహదారి గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'గ్రీన్‌బెల్ట్‌లో బడా వ్యాపారాలు' కథనానికి స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. పిఠాపురంకాలనీ గ్రీన్‌బెల్ట్‌లో సెకెండ్‌హ్యాండ్ కార్ల వ్యాపారాలు కార్ల వ్యాపారం నిర్వహిస్తున్నారు. అలాగే ద్విచక్ర వాహనాల షోరూమ్ నిర్వాహకులు కూడా గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలు చేసి సొంతానికి వినియోగిస్తున్నారు. దీంతో జీవీఎంసీ సిబ్బంది ఈ ఆక్రమణలు తొలిగించి గ్రీన్‌బెల్ట్‌ను పరిరక్షించారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా :** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 24, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 42, బీరకాయలు 54, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 24, క్యారెట్ 42 దొండకాయలు 48, బంగాళ దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోస కాయలు 32, వె ల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 60, కీరదోస 40, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడ దుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 44, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

త్యాగమే గొప్పదని ప్రవచించిన క్రీస్తు

పలు చోట్ల ఘనంగా క్రిస్మస్ వేడుకలు


ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు, (ఇన్‌సెట్‌లో) బోధన వినిపిస్తున్న పాస్టర్ అగస్టానీ

సిరిపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు నేర్పిన కరుణ, జాలి, ప్రేమ దయ అన్నింటికంటే గొప్పది త్యాగం అని, ఈ గుణాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సెయింట్ పాల్స్ చర్చి పాస్టర్ డాక్టర్ రెవరెండ్ జి.జాన్స్ అగస్టానీ అన్నారు.సిరిపురంలోని వాల్తేర్ క్లబ్ సమీపంలోని సెయింట్ పాల్స్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను బుధవారం తెల్లవారుజాము 12 గంటల నుంచి ఘనంగా నిర్వహించారు. క్రీస్తు బోధనలపై ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో భాగంగా వివిధ గీతాలను ఆలపించారు. ఏసుక్రీస్తు బోధనలు, జీవనం ప్రతీ ఒక్కరికీ ఆదర్శణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి రాకేష్ ఆనంద్, కోశాధికారి విజయపార్థన్, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

ఎంవీపీ కాలనీలో..


ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ రెండో సెక్టరులోని లూథరన్ చర్చిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వెలగపూడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో క్రిస్టియన్ సోదరుల సమక్షంలో వెలగపూడి రామకృష్ణబాబు కేకు కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సెల్వరాజ్, గొలగాని పోలరావు, సతీష్, కాళ్ల శంకర్, అప్పన్న, ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, నక్క కనకరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఏంజెల్స్, శాంతక్లజ్‌ల వేషధారణలో అలరించారు. ఆదర్శనగర్‌లోని లిటిల్ కిడ్డీస్ ప్లే స్కూలులో క్రిస్మస్ తాత వేషంలో చిన్నారులు అలరించారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ


రగ్గులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వెంకోజీపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్‌ను పురస్కరించుకొని భానునగర్ సీయోను మందిరంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ వంక శివశంకర్ లాజరస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి పాల్గొని వృద్ధులకు రగ్గులు అందజేశారు. సండే స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, విద్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా చర్చి సభ్యులకు నిర్వహించిన వివిధ విద్యా, ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే, డాక్టర్‌లకు చర్చి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ శివశంకర్ లాజరస్‌తో పాటు టీడీపీ నాయకులు నారు గోపి, బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, కాళ్ల శంకర్, అప్పన్న, శ్రీను, చర్చి సభ్యులు ఐ.విజయకుమార్, రాము, రాజు, సూర్యారావు, జేఎస్ రాములు, కిరణ్, మోజ్, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్రీస్తు జన్మ వృత్తాంత సెట్

ఆరిలోవ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో గల చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెదగదిలిలోని ఇమాన్యుల్ చర్చిలో ఏసు ప్రభువు పాకలో జన్మించిన ఉదంతాన్ని తెలిపి చిత్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం అర్థరాత్రి నుంచి మొదలైన ప్రార్థనలు రోజంతా సాగాయి. ఈ సందర్భంగా మత పెద్దలు సందేశాన్ని వినిపించగా, పలువురు గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం 2 వేల మంది భోజనాలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పోటీలు నిర్వహించి చిన్నారులకు బహుమతులు అందజేశారు. సాలిపేట కొండవాటు ప్రాంతంలోగల ఈశ్వర దేవీనగర్‌లోని నేబుల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ఏసుక్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.


పెదగదిలి ఇమాన్యుల్ చర్చిలో వేసిన సెట్

భార్య మృతితో మనోవ్యథ.. భర్త బలవన్మరణం

జగదాంబ కూడలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్య మృతిని తట్టుకోలేక తీవ్ర మనోవ్యథకు గురైన పైడాచారి (52) మంగళవారం అర్థరాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ దేముడుబాబు తెలిపిన వివరాల ప్రకారం... కురుపాం మార్కెట్ ఏరియా పప్పుల వీధి ప్రాంతంలో రామోజు పైడాచారి ఒంటరిగా నివాసం ఉండేవాడు. అతడి భార్య గత ఏడాది నవంబరులో మరణించింది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యాడని అతని కుమార్తె శిరీష తెలిపింది. ఇటీవలే వివాహమైన కొడుకు ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటున్నాడు. పైడాచారి మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి, అందరికీ జాగ్రత్తలు చెప్పాడు. తెల్లారే సరికి ఇంట్లో శవంగా కనిపించడంతో మృతుడి కుమార్తె వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అతడి కుమార్తె శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విషం తీసుకోవడం వల్లే తన తండ్రి మరణించాడంటూ కుమార్తె ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు సీఐ వెల్లడించారు.

నావికాదళ విన్యాసాల ఏర్పాట్లపై సమీక్ష

మహారాణిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో జనవరి 4న జరగనున్న నావికాదళ విన్యాసాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్న నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల నిర్వహణ సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ సమీక్షించారు. ఆర్కే బీచ్ వద్ద ఏర్పాటు చేయనున్న ప్రధాన వేదిక వద్ద బుధవారం ఆయన అధికారులతో కలసి పర్యవేక్షించారు. సీఎం రాక సందర్భంగా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని నేవీ అధికారులకు సూచించారు.

ఆలిండియా అథ్లెటిక్స్ మీట్‌కు కౌశిక్, హర్షిణి, బాలు


హర్షిణి, కౌశిక్, బాలు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌కు వాల్తేరు రైల్వే గ్రౌండ్ అథ్లెట్లు కౌశిక్, హర్షిణి, బాలు ఎంపికయ్యారు. కిట్స్ యూనివర్సిటీలో జరిగే ఈ టోర్నీ పురుషుల 100 మీ., 200 మీ. రేస్‌లో కె.కౌషిక్, 400 మీ. హర్డిల్స్‌లో బాలు, మహిళల 400 మీ. రేస్, 400 మీ. హర్డిల్స్‌లో నాగసాయి వర్షిణి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావులు బుధవారం రైల్వే గ్రౌండ్‌లో అథ్లెట్లతోపాటు కోచ్ పిట్టా శ్రీనివాసరావును అభినందించారు.

'పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ వద్దు'


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నేషనల్ పోర్టు ట్రస్టు యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు తదితరులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటీకరణ యత్నాలను నిరసిస్తూ అక్కయ్యపాలెంలోని పోర్టు ఆసుపత్రి వద్ద పలు కార్మిక సంఘాలు చేపడుతున్న రిలే నిరాహారదీక్ష 86వరోజు బుధవారం నేషనల్ పోర్టు ట్రస్టు యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు పాల్గొన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, వీవీ రమణ, అప్పలనాయుడు, కృష్ణ, నాగరాజు, హేమంత్, రామువులు, వై.వి.రమణారావు, మరిడయ్య పాల్గొన్నారు.

భార్య మృతితో మనోవ్యథ.. భర్త బలవన్మరణం

జగదాంబ కూడలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్య మృతిని తట్టుకోలేక తీవ్ర మనోవ్యధకు గురైన పైడాచారి (52) మంగళవారం అర్ధరాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ దేముడుబాబు తెలిపిన వివరాల ప్రకారం... కురుపాం మార్కెట్ ఏరియా పప్పుల వీధి ప్రాంతంలో రామోజు పైడాచారి ఒంటరిగా నివాసం ఉండేవాడు. అతడి భార్య గత ఏడాది నవంబరులో మరణించింది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యాడని అతని కుమార్తె శిరీష తెలిపింది. ఇటీవలే వివాహమైన కొడుకు ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటున్నాడు. పైడాచారి మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి, అందరికీ జాగ్రత్తలు చెప్పాడు. తెల్లారే సరికి ఇంట్లో శవంగా కనిపించడంతో మృతుడి కుమార్తె వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అతడి కుమార్తె శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విషం తీసుకోవడం వల్లే తన తండ్రి మరణించాడంటూ కుమార్తె ఫిర్యాదులో పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించినట్టు సీఐ వెల్లడించారు.

రైల్వేస్టేషన్‌లో 15 కిలోల గంజాయి పట్టివేత

▸ ఒడిశావాసి అరెస్టు

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని వద్ద నుంచి రూ.75 వేలు విలువ చేసే 15 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సబ్ ఇన్‌స్పెక్టర్లు పి.ఆర్.బిశోయి, కె.టి.ఆర్.లక్ష్మి తమ సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాలోని కోరాపుట్‌కు చెందిన కిరణ్ కిల్లో అనే వ్యక్తి గంజాయి రవాణా చేస్తూ చిక్కాడని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

క్యూలైన్లలో భక్తుల ఎడతెగని నిరీక్షణ

▸ కనకమహాలక్ష్మి ఆలయంలో భక్తుల బాధలు పట్టించుకోని అధికారులు ▸ పాలు, ఆహారం అందక పిల్లల అవస్థ ▸ దీర్ఘకాలిక రోగులదీ అదే సమస్య

జగదాంబ కూడలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాము చేసిన ఏర్పాట్లతో భక్తులకు సాఫీగా కనక మహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్ దర్శనం కలగడం, సంతోషంతో వారు హుండీల్లో కానుకలు వేయడంతో మునుపటి కంటే ఈసారి మార్గశిర మాసోత్సవాలకు ఆదాయం ఎక్కువగా వచ్చిందని ఈవో ప్రకటించినా, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. గంటల తరబడి క్యూలైన్లలో భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అనూహ్యంగా తరలి వస్తున్న భక్తులకు క్యూలైన్ల పరిస్థితి దయనీయంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ కొత్త రోడ్డు నుంచి అమ్మవారి ఆలయ ప్రధాన ద్వారం వరకు మూడు క్యూలైన్లలో భక్తుల రద్దీ నిరంతరం కొనసాగుతోంది. అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించాలన్న ఆత్రుతతో క్యూలైన్లలో నిల్చున్న భక్తులకు ఐదారు గంటల సమయం పడుతోంది. వీరికి మంచినీరు కూడా అందడం లేదు. పిల్లలతో వచ్చే మహిళలు ఎడతెగని నిరీక్షణతో నీరసించిపోతున్నారు. పిల్లలకు క్యూలైన్లలో ఎలాంటి ఆహారం అందక ఆకలితో అలమటిస్తున్నారు. దేవస్థానం అధికారులు పాలు, మజ్జిగ కూడా సరఫరా చేయకపోవడంతో భక్తులకు పాట్లు తప్పడం లేదు. బీపీ, సుగర్ వంటి అనారోగ్య సమస్యలతో అనేక మంది ఎక్కువ సేపు క్యూలైన్లలో నిల్చోలేక కుప్పకూలిపోతున్నారు. మజ్జిగ, బిస్కెట్లు గురువారాల్లో తప్ప సాధారణ రోజుల్లో ఇవ్వడం లేదని, తమ బాధలు పట్టించుకోవడం లేదని భక్తులు విమర్శిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో అడుగుపెట్టిన తర్వాత పన్నెండు మలుపులు తిరిగి గర్భగుడి లోపలకు ప్రవేశించాల్సి వస్తోంది. మూడో గురువారం అనుభవంతో క్యూలైన్లలో మార్పులు చేయడంతో అమ్మవారి దర్శనానికి మరిన్ని మలుపులు తిరగాల్సి వస్తోందని, దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని ఆలయ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నది భక్తుల ఆరోపణ. మండపం వద్ద క్యూలైన్లలో నిరీక్షించిన భక్తులు అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని బుధవారం నిలదీయడంతో వారు పక్కకు జారుకున్నారు. నాలుగోదైన చివరి గురువారం భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లలో ఆహారం, మంచినీరు అందించాలని భక్తులు కోరుతున్నారు.


బుధవారం క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

ప్రపంచ మొదటి మూడు దేశాల్లో త్వరలో భారత్

ఆర్థిక పటిష్టతపై మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు వ్యాఖ్య

మహారాణిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే మన దేశం ఆర్థికంగా ప్రపంచంలో మూడో స్థానంలో నిలుస్తుందని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. బుధవారం మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజపేయి శతజయంతి సందర్భంగా హోటల్ రాక్‌డేల్‌లో ఎలైట్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరిబాబు మాట్లాడుతూ కార్గిల్ విజయం, స్వర్ణ చతుర్భుజి, అంత్యోదయ పథకం, గిరిజన శాఖ ఏర్పాటు ఘనత వాజపేయిదన్నారు. హింసకు తావులేకుండానే మూడు రాష్ట్రాలు విభజించారని, విద్యారంగంలో సర్వశిక్షా అభియాన్, ఉపగ్రహ వ్యవస్థతో టీవీ ప్రసారాలు మెరుగుపరచి, మొబైల్ టెక్నాలజీని పరుగులు పెట్టించిన ఘనత ఆయనదేనన్నారు. మొబైల్ డేటాతో సంబంధం లేకుండా శాటిలైట్ డేటా ఇచ్చేరోజు దగ్గరలోనే ఉందన్నారు. వాజపేయి ఆశయ సాధనకు కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని హరిబాబు తెలిపారు.


హరిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

భువనేశ్వర్‌కు విమాన సర్వీసు నడపాలి

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మిజోరం గవర్నర్‌గా పనిచేస్తూ తాజాగా ఒడిశా గవర్నర్‌గా నియమితులైన కంభంపాటి హరిబాబును బుధవారం ఆయన ఇంట్లో పలువురు నగర ప్రముఖులు కలిసి అభినందించారు. విశాఖ విమానాశ్రయం సలహా కమిటీ సభ్యులు ఓ.ఓ.నరేశ్‌కుమార్, డీఎస్ వర్మలు పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు విమాన సర్వీసు నడిపేలా కృషి చేయాలని కోరారు.

రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (08522/08521) జనవరి 1 నుంచి 31 వరకు ఒక స్లీపర్ కోచ్, భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18463/18464) జనవరి 1 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22876/22880) నామినేటెడ్ రోజుల్లో జనవరి 4 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, సంబల్‌పూర్-నాందేడ్-సంబల్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20809/20810) నామినేటెడ్ రోజుల్లో జనవరి 3 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్, సంబల్‌పూర్-ఈరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (08311/08312) నామినేటెడ్ రోజుల్లో జనవరి 1 నుంచి 31 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్; భువనేశ్వర్-జునాగఢ్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు 20837/20838) జనవరి 1 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్, పూరి-యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22883/22884) జనవరి 3 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నామని పేర్కొన్నారు.

ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యునిగా ప్రసన్నకుమార్

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యునిగా ద ఒలింపిక్ సంఘం, విశాఖ అధ్యక్షుడు, నగరానికి చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ డి.ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. ప్రతిష్ఠాత్మక పదవికి ఎంపికైన ఆయనను ద ఒలింపిక్ సంఘం విశాఖ శాఖ కార్యవర్గం అభినందించింది. దీనిలో భాగంగా బుధవారం ప్రసన్నకుమార్‌ను పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా ద ఒలింపిక్ సంఘం చైర్మన్, ప్రభుత్వ విప్ గణబాబు, సంఘం మాజీ అధ్యక్షుడు టీఎస్ఆర్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా క్రీడలకు విశేష సేవలందిస్తూ ప్రతిభ గల క్రీడాకారులను వివిధ రూపాల్లో ప్రోత్సహించడమే కాకుండా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఎనిమిదేళ్ల నుంచి క్రీడా దినోత్సవం, ఒలింపిక్ దినోత్సవం వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తూ అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహాలు అందించడం విశేషమని పేర్కొన్నారు. విశాఖ జిల్లా క్రీడలకు వెన్నెముకగా నిలుస్తున్న ప్రసన్నకుమార్, ప్రతిష్ఠాత్మక ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నిక కావడం నగర క్రీడారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు, ఇతర ప్రతినిధులు గోపీకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రసన్నకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఒలింపిక్ సంఘం సభ్యులు

నావికాదళ విన్యాస ఏర్పాట్లపై సమీక్ష


భద్రత ఏర్పాట్లపై చర్చిస్తున్న నేవీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు

మహారాణిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో జనవరి 4న జరగనున్న నావికాదళ విన్యాసాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్న నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల నిర్వహణ సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్ సమీక్షించారు. ఆర్‌కే బీచ్ వద్ద ఏర్పాటు చేయనున్న ప్రధాన వేదిక వద్ద బుధవారం ఆయన అధికారులతో కలసి పర్యవేక్షించారు. సీఎం రాక సందర్భంగా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని నేవీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, నేవీ కమాండర్ హ్యాపీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జ్ఞానాపురం/డాబా గార్డెన్స్/అక్కయ్యపాలెం/సీతమ్మధార/మురళీనగర్/సీతంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, కరుణ, దానగుణం, త్యాగమే క్రీస్తు బోధనల సారాంశమని వివిధ చర్చిల పాస్టర్లు అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్, జ్ఞానాపురం, కంచరపాలెం, మురళీనగర్, సీతమ్మధార, సీతంపేట, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని పాస్టర్లు వివరించారు. విశ్వాసులు ఏసు క్రీస్తు గీతాలు ఆలపించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పశువుల పాక, బాల ఏసుని సుందరంగా అలంకరించారు. సాలిగ్రామపురంలో చిన్నారుల ప్రత్యేక కార్యక్రమాలు, క్యాండిల్ లైట్ సర్వీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశ్వాసులకు పాదర్లు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ఈవ్ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. సీతంపేటలోని బేతల్ అసెంబ్లీ చర్చ్‌లో ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.


సీతమ్మధార బాలయేసు చర్చిలో సామూహిక ప్రార్థనలు

కవి సమాజ నిర్దేశకుడు



ప్రసంగిస్తున్న ద్విభాష్యం రాజేశ్వరరావు

సీతంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కవిత్వం ఒక భావ విపంచి, కవులు, రచయితలు సమాజ మార్గదర్శకులని ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ఓ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గోష్ఠి నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయితలు, సాహితీవేత్తలు డాక్టర్ డి.వి. సూర్యారావు, ఉప్పల అప్పలరాజు, సిహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, దర్భముళ్ళ చంద్రశేఖర్, డాక్టర్ పేరి రవికుమార్, రాంభట్ల నృసింహ శర్మ, డాక్టర్ కెవిఎస్ మూర్తి, పివిశర్ కుమార్ రావు, కెవిఎస్ నరసింహం, పరమేశ్వరరావు రచనలపై విశ్లేషించారు.

హరిప్రియకు రైల్ సేవా పురస్కారం

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్, విశాఖలో చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హరిప్రియకు భారతీయ రైల్వేలోని ప్రతిష్ఠాత్మక అతి విశిష్ట రైల్ సేవా పురస్కారం లభించింది. టికెట్ తనిఖీలలో వినూత్న పద్ధతులు అవలంబించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో వాల్తేరు డివిజన్ రూ.28.46 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడంలో కీలకపాత్ర పోషించారని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే బాడీ వోర్న్ కెమెరాలు, హ్యాండ్ హెల్డ్ టెర్మినల్స్ అమర్చడంలో బెంచ్ మార్కులు అందుకుని రైల్వే శాఖ సేవల్లో నిబద్ధత పాటించి మార్గదర్శకంగా నిలిచారని ప్రశంసించారు. ఈ నేపథ్యంలో ఆమె సేవలకు గుర్తింపుగా ఇటీవల ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానం కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి ప్రతిష్ఠాత్మక అతి విశిష్ట రైల్ సేవా పురస్కారం అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు బుధవారం తన కార్యాలయంలో హరిప్రియను అభినందించి విధుల నిర్వహణలో అసాధారణ కృషి, ప్రతిభ చూపిన వారికి అవార్డులు గుర్తింపుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగ నిర్వహణలో అంకితభావం, చిత్తశుద్ధి, నిబద్ధత పాటిస్తే తగిన గుర్తింపు లభిస్తుందనడానికి హరిప్రియ ఉదాహరణగా నిలిచారని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె ఇదే స్ఫూర్తితో విధులు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.సందీప్ పాల్గొన్నారు.


హరిప్రియకు ప్రశంసాపత్రం అందిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, చిత్రంలో సీనియర్ డీసీఎం సందీప్

వంటగ్యాస్ లీకై మంటలు..ఐదుగురికి గాయాలు


ఆసుపత్రిలో బాధితుల్ని పరామర్శిస్తున్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 10వ వార్డులోని ఇందిరానగర్‌లో బుధవారం రాత్రి 9:30 గంటల సమయంలో ఓ ఇంట్లో మహిళ వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలైనట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. గాయాలైన వారిలో సత్యవతికి (28) 50 శాతం, చంద్రశేఖర్ (13)కు 25 శాతం, రాజశేఖర్ (11)కు 45 శాతం, పి.వెంకటేశ్వరరావు (30)కు 20 శాతం గాయాలు కాగా, జస్మిత (1)కు తలకు గాయమైంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం విమ్స్‌కు తరలించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, స్థానిక కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్ విమ్స్‌ను సందర్శించి బాధితులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని విమ్స్ డైరెక్టర్ రాంబాబును ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ ఘటన నేపథ్యంలో ఇందిరానగర్‌లో ఆందోళన నెలకొంది. కాగా, సత్యవతి స్థానికంగా ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తోంది. బుధవారం రాత్రి ఇంటికి వచ్చి వంట చేసేందుకు సిద్ధమవగా ఈ ప్రమాదం సంభవించినట్టు తెలిసింది. ఈ ఘటనపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పాలనా సంస్కర్త వాజపేయి'

మాధవధార/అక్కయ్యపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్టీని, ప్రధాని పదవీ బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అటల్ బిహారీ వాజపేయి అని బీజేపీ నాయకులు కొనియాడారు. మాజీ ప్రధాని వాజపేయి శతజయంతి వేడుకలను మాధవధార, అక్కయ్యపాలెం 42వ వార్డులో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాధవధారలో వాజపేయి చిత్రపటానికి మురళీనగర్, మాధవధార ప్రాంత నాయకులు నివాళులర్పించారు. మాధవధార మండల అధ్యక్షుడు రామకృష్ణ, సీనియరు నాయకులు పృథ్వీరాజ్, కూన వెంకటరావులు వాజపేయి చేపట్టిన సంస్కరణల్ని గుర్తుచేశారు. అక్కయ్యపాలెం 42వ వార్డులో బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ ఆధ్వర్యంలో వాజపేయి చిత్రపటానికి ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆచారి, శ్రీదేవి, త్రివేణి వర్మ, వెంకటరావు, లక్ష్మీకమల పాల్గొన్నారు.


మాధవధారలో వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

లలిత కళలపై ఆసక్తి కనబరచాలి

కంచరపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు లలిత కళల ప్రాముఖ్యతను తెలిపి, వారి దృష్టిని లలిత కళల వైపు మళ్లేలా తల్లిదండ్రులు చూడాలని జీవీఎంసీ వైద్యాధికారిణి పి.హేమలత సూచించారు. స్థానిక బీఎస్ఆర్ భవనంలో బుధవారం విశాఖ చిత్ర కళాపరిషత్ ఆధ్వర్యంలో బాలల చిత్ర కళాపోటీలు నిర్వహించారు. వీటిని ప్రారంభించిన హేమలత మాట్లాడుతూ బాల్యం నుంచే కళలపై ఆసక్తి కనబరిచేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు అంట్యాకుల త్రినాథ్ మాట్లాడుతూ వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజు తెలుగు చిత్రకళకు అందించిన సేవలను కొనియాడారు. బీఎస్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి బుజ్జి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి సుంకర చలపతిరావు, డీఎస్.మనోహర్, బి.త్యాగరాజు, పత్తి ప్రసాద్, పెంటకోట రామారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరానికి చెందిన 25 మంది చిత్రించిన 200 చిత్రాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఐటీ అభివృద్ధికి ఊతం

... 5వ పేజీ తరువాయి

కాకినాడ, తిరుపతి నగరాల్లో ఇంకుబేషన్ సెంటర్లు ఉన్నాయి. అత్యంత కీలకమైన విశాఖపట్నంలోనే సెంటర్ లేదు. గతంలో వీఎంఆర్‌డీఏతో రూ.40 కోట్లకు ఒప్పందం చేసుకున్నారు. నిర్మాణ పనుల పర్యవేక్షణ విషయంలో విభేదాలు రావడంతో అది ఆగిపోయింది. విశాఖ ఎస్‌టీపీఐ జాయింట్ డైరెక్టర్ ఎలాగైనా విశాఖలో ఇంకుబేషన్ సెంటర్ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని నిర్ణయించి ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులను సంప్రతించారు. ఏయూలో ఎకరా స్థలం కేటాయిస్తే.. అందులో 100 సీట్ల సామర్థ్యంతో ఇంకుబేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రతిపాదనలు ఇచ్చారు. అంతేకాకుండా దువ్వాడలోని ఎస్‌టీపీఐ ప్రధాన కార్యాలయాన్ని కూడా ఇక్కడికే తీసుకువచ్చేస్తామని చెప్పారు. ఇది విశాఖలో ఐటీ అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఏయూ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి 2022 జూన్‌లో నివేదిక పంపారు. దీనిపై విద్యా శాఖ నిర్ణయం తీసుకోవలసి ఉందని చెప్పి ఫైల్ పక్కన పెట్టేశారు. ఇప్పుడు ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రిగా లోకేశ్ ఉండడం, విశాఖలో ఐటీ ప్రతినిధులు ఎస్‌టీపీఐ భూమి విషయం ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఫైల్ క్లియర్ చేశారు. ఎస్‌టీపీఐ కోరిన ఎకరా భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దాంతో ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. త్వరగా సెంటర్ నిర్మాణం పూర్తిచేయాలని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావును కోరగా..తప్పకుండా చేస్తామని అరవింద్‌కుమార్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్యానల్స్

... 5వ పేజీ తరువాయి

అధికారులకు వచ్చింది. వెంటనే ఈపీడీసీఎల్ అధికారులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు ఏవీ సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. అన్ని విభాగాలూ లక్షల రూపాయల్లో బకాయి ఉన్నాయి. ఇవి ఈపీడీసీఎల్‌కు కూడా గుదిబండగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు ఉపయుక్తంగా ఉండేలా ప్రతి ప్రభుత్వ కార్యాలయంపైనా ప్యానళ్లు ఏర్పాటుచేసి సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని, అవసరమైనంత ఉపయోగించుకుని, మిగిలింది గ్రిడ్‌కు సరఫరా చేయాలని నిర్ణయించారు.

జిల్లాలో 11,257 ప్రభుత్వ కార్యాలయాలు

జిల్లా ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్న వెంటనే ఈపీడీసీఎల్ అధికారులు రంగంలో దిగారు. జిల్లాలో మొత్తం 11,257 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నట్టు లెక్క తేల్చారు. ఏడాదికి లక్ష యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించే ప్రభుత్వ కార్యాలయాల్లో మొదట సోలార్ ప్యానళ్లు పెట్టాలని తీర్మానించారు. ఇవి ఒక్కొక్కటి 150 కిలోవాట్లకు పైగా సామర్థ్యం కలిగినవని ఈపీడీసీఎల్ ఉన్నతాధికారి తెలిపారు. వీటికి అయ్యే వ్యయం, ఇతర మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావలసి ఉంది. అవి అందిన వెంటనే పనులు ప్రారంభిస్తారు.

మాతృ వందన యోజన సాయం విడుదల

... 5వ పేజీ తరువాయి

లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం కింద తొలిసారి గర్భం దాల్చిన మహిళకు ఐదు వేల రూపాయలు అందిస్తారు. జిల్లాలో 5,478 మందికి మొదటి, రెండు విడతలకు సంబంధించిన సొమ్ము చెల్లించాల్సి ఉంది. 3,591 మందికి తొలి విడత నిధులు చెల్లించాల్సి ఉండగా, 2,861 మందికి రూ.2 వేలు చొప్పున రూ.85,83,000 జమ చేశారు. అలాగే, రెండో విడతకు సంబంధించి 1004 మందికిగాను 357 మందికి మూడు వేలు చొప్పున రూ.7,14,000 చెల్లించారు. మిగిలిన వారికి కూడా కొద్దిరోజుల్లోనే నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే, రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టిన వారికి ఈ పథకం కింద ఆరు వేలు చొప్పున అందిస్తారు. అందుకు 2,347 మంది అర్హులుగా అధికారులు గుర్తించారు. ఈ దరఖాస్తులు గడిచిన కొద్దినెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వీరిలో 804 మందికి రూ.6 వేలు చొప్పున రూ.48,24,000 చెల్లించారు. కొన్ని నెలలు నుంచి పెండింగ్‌లో ఉన్న మొత్తాలను చెల్లించడం పట్ల లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మారని మందుబాబులు

... 5వ పేజీ తరువాయి

పంథామార్చారు. జరిమానా విధించి వదిలేయకుండా కోర్టులో హాజరుపరచడం మొదలుపెట్టారు. కోర్టు విచారణ జరిపి మొదటిసారి పట్టుబడిన వారికి రూ.పది వేలు జరిమానా విధించడం, రెండోసారి జైలుశిక్ష విధించడం చేస్తోంది. దీనివల్ల మందుబాబుల తీరు మారుతుందని అంతా భావించారు. కానీ ఆశించిన స్థాయిలో మార్పు కనిపించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ పోలీసులు 33,707 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదుచేశారు. వాటిలో 22,120 కేసులను న్యాయస్థానాలు పరిష్కరించాయి. నిందితులకు రూ.11.05 కోట్లు జరిమానా విధించాయి. ఈ కేసుల్లో 258 మందికి జైలు శిక్ష పడింది. ఇంకా 11,587 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

సహకార పదవులకు పోటీ

... 5వ పేజీ తరువాయి

డీసీఎంఎస్ రేసులో ఉన్నారని, అయితే వారిలో కొందరు తమ పేర్లు బయట పెట్టకుండా ఎమ్మెల్యేలను కలవడంతోపాటు అధిష్ఠానాన్ని కలిశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. డీసీసీబీ, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవులు ఒకే వర్గానికి కాకుండా రెండు ప్రధాన సామాజిక వర్గాలకు ఇస్తే సమతుల్యత పాటించినట్టు అవుతుందని పార్టీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు.

జిల్లాలో 98 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించనున్నందున గ్రామ స్థాయి నాయకుల పేర్లతో జాబితాలు రూపొందించే పనిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. త్వరలో 98 సంఘాలకు సంబంధించిన జాబితాలను అధిష్ఠానానికి పంపనున్నారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో నామినేటెడ్ పదవులు పంపిణీ చేయనున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లకు ఈ నెల 27న నిర్వహణ పనులు చేపడుతుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. షీలానగర్, హరిజనజగ్గయ్యపాలెం, గవర జగ్గయ్యపాలెం, వేంకటేశ్వర కాలనీ, పోర్టు రోడ్ ఏరియా, కిమ్స్ ఆస్పత్రి ఏరియా, కుమిలి లే అవుట్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

నేడు సీఐటీయూ ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు ఉద్యోగుల వేతనాల కోసం గురువారం ధర్నా నిర్వహించనున్నట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఇప్పటికి యాజమాన్యం 185 శాతం జీతం ఉద్యోగులకు ఇవ్వాల్సి ఉందని, మరో వారం రోజుల్లో ఈ నెల పూర్తవుతుందని, అయినప్పటికీ స్పందించడం లేదన్నారు. తక్షణమే జీతాలు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చేందుకు ఉదయం 7 గంటల నుంచి అడ్మిన్ భవనం ముందు ధర్నా చేయనున్నామని, కార్మికులు, ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

భద్రత పెంచాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కార్మికులకు మరింత భద్రత పెంచాలని కోరుతూ విభాగాధిపతికి కార్మిక నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డుపై భారీ వాహనాలు నిలుపు చేయరాదని, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు భద్రత పనిముట్లను ఇవ్వాలని కోరారు. ప్రమాదాల జంక్షన్‌లో సిబ్బందిని నియమించాలని కోరారు. దీనిపై విభాగాధిపతి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో పిట్టా రెడ్డి, నాయుడు, రాము, అప్పలనాయుడు పాల్గొన్నారు.

గోదాదేవికి కుంకుమార్చన

పెందుర్తి/వేపగుంట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ, పూజలు అభిషేకాలు జరిపారు. గోదాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం తిరుప్పావై పాశురాన్ని నివేదించారు. నాయుడుతోట కల్యాణ వెంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు.

'కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే సహించం'

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మంత్రి రవి అన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లాంట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఏడో తేదీలోగా జీతాలు చెల్లించాలని, స్కిల్డ్ కార్మికులకు ఉక్కు ఆస్పత్రిలో వైద్య సదుపాయం కల్పించాలని, ప్రధాన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫుల్ అండ్ ఫైనల్‌ను పాత పద్ధతిలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజబాబు, సీహెచ్ నాగరాజు, పల్లా మంగరాజు, మురళీకృష్ణ, నూకరాజు, దాసరి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాద), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 24, వంకాయలు(తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 42, బీరకాయలు 54, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 24, క్యారెట్ 42 దొండకాయలు 48, బంగాళ దుంపలు 28, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 140, అల్లం 56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోసకాయలు 32, వెల్లుల్లి 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 60, కీరదోస 40, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 44, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యరపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210


మాట్లాడుతున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు


ములగాడ చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు


పినమడక చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

వాడవాడలా క్రిస్మస్ వేడుకలు

గోపాలపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల్లో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గోపాలపట్నం ఇందిరానగర్, లక్ష్మీనగర్, పద్మనాభనగర్, కొత్తపాలెం, చంద్రనగర్, నాగేంద్ర కాలనీ, బాపూజీనగర్ చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలుచోట్ల క్రీస్తు జన్మించిన పశువుల పాక నమూనాలను, క్రిస్మస్ చెట్టు నెలకొల్పారు. లక్ష్మీనగర్ సేవియర్ లూథరన్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా క్రీస్తు జననంపై చిన్నారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని చర్చిల్లోనూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు బోధనలను సందేశంగా వినిపించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పెందుర్తి: మండలంలోని అన్ని చర్చిల్లోనూ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పెందుర్తి, చినముషిడివాడ, శాంతినగర్‌లో ఉన్న చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా సామూహిక బృంద గీతాలను ఆలపించారు.

అగనంపూడి: అగనంపూడి, ఉక్కు, ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లో క్రిస్మస్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పినమడక కల్వరి చర్చిలో జరిగిన వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని కేక్ కట్ చేశారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, నేతలు కర్రి దోశేంద్ర, ఇల్లపు ప్రసాద్, చందు, సత్యనారాయణ, అచ్యుత్, సత్యారావు, వెంకటరావు, చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: హౌసింగ్ బోర్డు కాలనీ రహెమా బ్లెస్సింగ్ చర్చిలో క్రిస్టమస్ వేడుకల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుమారి, కృపారావు, నవీన్, పెంటయ్య, కన్నారావు, సింహాచలం, సతీష్, శంకర్, భూలక్ష్మి, అరుణ, సుధ, ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: పారిశ్రామిక ప్రాంతంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.శ్రీనగర్ సీఎల్సీ చర్చిలో బిషప్ సుధీర్ మహంతి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. శాంతాక్లాజ్ వేషాల్లో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కణితి మిరాకిల్ చర్చిలో పాస్టర్ సీహెచ్ సతీష్ ఆధ్వర్యంలో ఏసు త్యాగాలను బోధించారు.

సింధియా: జై ఆంధ్రకాలనీ క్రైస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సైలస్, పాస్టర్ రాజేష్ మనోహర్, పీటర్, భక్తులు పాల్గొన్నారు.

గాజువాక /ఉక్కుటౌన్‌షిప్: గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు అత్యంత వేడుకగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యూబీ చర్చిలో అధ్యక్షుడు పుచ్చా విజయ్‌కుమార్, పాస్టర్ వి.శంకర్ పాల్గొన్నారు. గాజువాక బెతెస్థా ఇవాంగికల్ చర్చిలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కేక్ కట్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఇంటక్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు కేక్ కట్ చేశారు. ఫాదర్ కొమ్ము ప్రసాద్, రమణ, సుబ్బయ్య, గోపి, పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: గ్రేటర్ 68, 69 వార్డుల పరిధిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. షీలానగర్ హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చిలో పిల్లలు ప్రత్యేక క్రీస్తు జన్మ రూపకాలు ప్రదర్శించారు. పాస్టర్ సుధాకర్ రాజారత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హరిజన జగ్గయ్యపాలెంలోని సియోను చర్చిలో పాస్టర్ రత్నం ప్రార్థనలు చేశారు. రామ్‌నగర్ లూథరన్ చర్చి, తుంగ్లాం, అక్కిరెడ్డిపాలెం గోస్పల్ చర్చిలో వేడుకలు జరిగాయి.

వేపగుంట: క్రీస్తు బోధనలు అనుసరణీయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. వేపగుంటలో బైబిల్ మిషన్ సమృద్ధి గృహ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడారు. ఎ పాస్టర్ సీహెచ్ సుందరరావు క్రీస్తు సందేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బల్ల శ్రీను, శేనాపతి శంకర్రావు, అప్పారావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏడీ జంక్షన్: లక్ష్మీనగర్ సేవియర్ లూథరన్ చర్చిలో పాస్టర్ జాకబ్‌రాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ కప్పల డానియల్ గాంధీ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


హరిజనజగ్గయ్యపాలెంలో చిన్నారుల సందడి


జై ఆంధ్ర కాలనీలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు


శ్రీనగర్ సీఎల్సీ చర్చిలో ప్రార్థన చేస్తున్న దృశ్యం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

» **మెప్మా బజార్ ప్రారంభోత్సవంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు**

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల మేళాను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎంవీపీ కాలనీలోని అల్వార్‌దాస్ మైదానంలో ఐదురోజులు నిర్వహించే మేళా ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళల స్వయం సమృద్ధికి అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నారన్నారు. సుమారు వంద స్టాళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలు స్టాల్స్ ఏర్పాటుచేశారని, వివిధ రకాల ఉత్పత్తులను కొనుగోలు చేసి సహకరించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ మేళా ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్టాళ్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు సందర్శించి, వ్యాపారులు, డ్వాక్రా సంఘాల మహిళలతో సంభాషించారు. మేళా నిర్వహణకు కేంద్రం రూ.25 లక్షలు మంజూరు చేసిందని యూసీడీ పీడీ సత్యవేణి తెలిపారు. డ్వాక్రా మహిళలందరికీ స్టాల్స్ ఉచితంగా కేటాయించామని, 20 ఫుడ్ స్టాల్స్‌కు లాటరీ వేశామన్నారు. జీవీఎంసీ పరిధిలోని డ్వాక్రా సంఘ సభ్యులంతా ప్రదర్శన తిలకించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆవరణలో ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వస్త్రాలు, ఒన్ గ్రామ్ గోల్డ్ ఐటమ్స్, ఆట, అలంకరణ వస్తువులు, తినుబండారాల స్టాళ్లు ఏర్పాటుచేశారు. మొదటి రోజు పది వేల మంది మహిళలు హాజరైనట్టు అధికారులు తెలిపారు.


చీరలు పరిశీలిస్తున్న ఎంపీ బాబూరావు, ఎమ్మెల్యే వెలగపూడి


మెప్మా బజార్‌కు తరలివచ్చిన మహిళలు

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి: సీపీఎం

అగనంపూడి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలో ఈ నెల 28 నుంచి రెండు రోజులు పాటు నిర్వహించనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం జోనల్ కమిటీ సభ్యులు ఉరిటి మరిడయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతో సీపీఎం ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు వంకర రాము, నారాయణరావు, పట్టా రమేష్, శశిరెడ్డి, ఆంజనేయులు, ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో బైక్ ర్యాలీ

మల్కాపురం: పెందుర్తి మండలం చినముషిడివాడలో ఈనెల 28, 29 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మల్కాపురం పార్టీ నాయకులు పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని స్థానిక కాకరలోవలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. జగ్గునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. కాగా ర్యాలీ క్రాంతినగర్ నుంచి త్రినాథ్‌పురం, దుర్గానగర్, జనతా కాలనీ మీదుగా నెహ్రూనగర్, లేబర్ జంక్షన్ నుంచి శ్రీహరిపురం, మల్కాపురం వరకు సాగింది.

ఈ కార్యక్రమంలో మల్కాపురం జోన్ కార్యదర్శి పూడి పైడిరాజు, కె.పెంటారావు, సత్యారావు, పీవీ భాస్కరరావు, ఎన్. శ్రీనివాసరావు, బి. కృష్ణ, ఎల్. కృష్ణ, ఆదినారాయణ, నరేశ్, వాసు, కె. రమణ, అర్జునరావు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీఎం నేత జగ్గునాయుడు

సామాజిక భవనం, జిమ్ ప్రారంభం


జిమ్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా, డిసెంబరు 25, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో నూతన సామాజిక భవనము, జిమ్‌ను బుధవారం స్థానిక కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధిలో భాగంగా జీవీఎంసీ నిధులు రూ.18 లక్షలతో సామాజిక భవనం, రూ.5 లక్షలతో జిమ్ సామగ్రి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వార్డులో మరెన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో గంట వర్మ, గణేశ్ మిశ్ర, పలువురు నాయకులు యువత పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి

గాజువాక, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి వాజపేయి శత జయంతోత్సవాలను గాజువాకలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ గాజువాక శాఖ కార్యాలయంలో వాజపేయి చిత్రపటానికి గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ శతాబ్దపు భారదేశానికి పునాది వేయటంలో వాజపేయి కీలకపాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, నాయకులు సిరసపల్లి నూకరాజు, గూటూరు శంకరరావు, శశిధర్ పిళ్లై, నాగేశ్వరరావు, అనిత, దిలీప్, మునలయ్య, అప్పలరాజు పాల్గొన్నారు.

మల్కాపురం: మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న 83వ బూత్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్‌బాబు, తదితరులు వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 83వ బూత్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి గోపి, బీఎల్‌ఓ చరణ్, వరలక్ష్మి, రామకృష్ణ, ములగాడ మండల పార్టీ అధ్యక్షుడు గురుమూర్తి, సత్యనారాయణ, కాలనీ పెద్దలు సింహాచలం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెందుర్తి రూరల్: సుజాతనగర్‌లో వాజపేయి శత జయంతి ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చిక్కాల సతీశ్, గురునాథం, ప్రసాద్, లక్ష్మణకుమార్, వెంకటరమణ, అప్పలరాజు, కృష్ణమూర్తి, గోవిందరావు, మాధవి పాల్గొన్నారు.

ఎన్ఏడీ జంక్షన్: బుచ్చిరాజుపాలెంలో వాజపేయి జయంతి నిర్వహించారు. బీజేపీ పశ్చిమ కన్వీనర్ దాడి రమేశ్, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మంజుల, వలిరెడ్డి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, అప్పలరాజు, సురేశ్, చంద్రశేఖర్, మహేశ్, గణేశ్ పాల్గొన్నారు.


గాజువాకలో నివాళి అర్పిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు


మల్కాపురంలో నివాళి అర్పిస్తున్న నేతలు


బుచ్చిరాజుపాలెంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

అప్పన్న వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు

సింహాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పండితులు రూపొందించిన 2025 ఆంగ్ల సంవత్సర వార్షిక క్యాలెండర్‌ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆవిష్కరించారు. ఈవో వేంద్ర త్రినాథరావుతో కలిసి బుధవారం విజయనగరంలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈఓ మాట్లాడుతూ దేవాలయంలో ఏడాది మొత్తం నిర్వహించే ఉత్సవాల వివరాలు క్యాలెండర్‌లో పొందుపరిచారన్నారు. త్వరలో సింహగిరిపై భక్తులకు విక్రయిస్తామన్నారు. గత ఏడాదిలానే సింగిల్‌పేజీ, ఆరుపేజీల క్యాలెండర్లు ముద్రించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇంజనీర్లు డీజీ శ్రీనివాసరాజు, బి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే పల్లా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి వార్డుల్లో ప్రజాదర్బార్ ద్వారా అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గాజువాకలో యాభై వేల వరకు పార్టీ సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, పార్టీ నాయకులు పులి వెంకట రమణారెడ్డి, ఎండీ రఫీ, అంగ కృష్ణ, బైపిల్లి గాంధీ, చట్టి గోపి, పల్లా రమణ, శంకరరావు పాల్గొన్నారు.

2025లో రెండుసార్లు ఉత్తర ద్వార దర్శనం

సింహాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో ఒకసారి మాత్రమే భక్తులకు స్వామివారి ఉత్తరద్వార దర్శనం లభిస్తుంటుంది. కానీ 2025లో రెండుసార్లు ఆ అవకాశం లభించనుంది. ఏటా ధనుర్మాసంలో పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశి రోజున వైష్ణవాలయాల్లో ఉత్తరద్వార దర్శనం లభిస్తుంది. ఈ క్రమంలో 2025 జనవరి 10న వైకుంఠ ఏకాదశి కావడంతో ఉత్సవ నిర్వహణకు సింహాచలం దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా అదే ఏడాది డిసెంబరు 30న కూడా వైకుంఠ ఏకాదశి పర్వదినం వచ్చిందని పంచాంగకర్తలు వివరించారు. దీంతో ఒకే ఏడాదిలో భక్తులకు రెండుసార్లు స్వామివారి ఉత్తర ద్వార దర్శన భాగ్యం లభించనుంది.

ముగిసిన దేశ్ కీ ప్రకృతి పరీక్షాన్ అభియాన్


ఆయుష్ ప్రాంతీయ సంచాలకులు ఝాన్సీలక్ష్మి

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించేందుకు వీలుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారం భించిన దేశ్ కీ ప్రకృతి పరీక్షాన్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా ముగిసిందని ఆయుష్ ప్రాంతీయ సంచాలకులు డి.ఝాన్సీ లక్ష్మి తెలిపారు. సంస్థ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ గతనెల 26 నుంచి బుధవారం వరకు అవగాహన శిబిరాలను నిర్వహించామన్నారు. సుమారు 5,965 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చడంతోపాటు మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. శిబిరాల్లో సీనియర్ వైద్యులు పి.జగదీశ్, ఎం.ఆనందరావు, వి.సీతామహాలక్ష్మి, బి.సునీత, ఎస్.శ్రీనివాసరావు, బి.పద్మావతి, ఎన్.లక్ష్మి సౌజన్య సేవలందించారన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ (గాట్), టెక్నీషియన్ అప్రెంటిస్ ట్రైనీ (టాట్)కు యాజమాన్యం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది గాట్ 200 పోస్టులు, టాట్ 50 పోస్టులను భర్తీచేయనున్నారు. గాట్‌కు గ్రాడ్యుయేషన్, టాట్‌కు డిప్లొమా విద్యార్హత కలిగి ఉండాలన్నారు. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9 వేలు, టాట్‌కు రూ.8 వేలు స్టైఫండ్ చెల్లిస్తారు. 2022, 2023, 2021లో గ్రాడ్యుయేషన్, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జనవరి 9వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఉక్కు యాజమాన్యం పేర్కొంది.

కొంకణ్ పర్వతంపై యువకుడి మృతి


అనిల్‌కుమార్ (ఫైల్)

కూర్మన్నపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కొంకణ్ పర్వతం అధిరోహిస్తుండగా శ్వాస సంబంధిత సమస్య ఏర్పడడంతో ఈ ప్రాంతానికి చెందిన యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 86వ వార్డు శాతవాహననగర్ రోడ్డు నంబరు-1కు చెందిన కాండ్రేగుల అనిల్ కుమార్ (31) బెంగళూరులోని ఓ కంపెనీలో చార్టెడ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. ఇటీవల కొంతమందితో గోవా, కొంకణ్ పర్వతాలకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం కొంకణ్ పర్వతం అధిరోహిస్తుండగా కుప్పకూలిపోవడంతో స్నేహితులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అనిల్‌కుమార్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని బుధవారం ఇక్కడికి తీసుకువచ్చారు. అందివచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు తరలిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

గరుడ వాహనం ప్రారంభం


వాహనం ప్రారంభిస్తున్న కమిటీ ప్రతినిధులు

అగనంపూడి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సమకూర్చినగరుడ వాహనాన్ని బుధవారం ప్రారంభించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తొమ్మిదో పాశురం చదివి వినిపించారు. ధర్మకర్త ఈకే చారి, ప్రతినిధులు గొల్లవిల్లి వెంకటరావు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సాహిబ్‌నాయుడు, సత్యనారాయణ, కృష్ణారావు, పాల్గొన్నారు.

న్యూపోర్టు సీఐని కలిసిన సీపీఐ నేతలు

పెదగంట్యాడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): న్యూపోర్టు సీఐగా బాధ్యతలు చేపట్టిన తోటాడ కామేశ్వరరావును బుధవారం పెదగంట్యాడ సీపీఐ నాయకులు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి యెల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, దోమ్మేటి అప్పారావు, దుర్గారావు, పోలయ్య తదితరులు ఉన్నారు.

సింహపురి కాలనీ అసోసియేషన్ కార్యవర్గం

వేపగుంట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింహపురి కాలనీలో కొలువైన సీతా రామాలయ ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా తంటపురెడ్డి చిరంజీవిరావు, కార్యదర్శిగా సిరికి నాయుడు, కోశాధికారిగా టీవీ శేషారావు, మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా కామేశ్వరరావు, విష్ణుమూర్తి, చింతారావు, చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహరించారు.